సాక్షి
ప్రకాశం
శుక్రవారం । 4 । ఆగస్టు । 2023



విహంగ విలాసం!

కంభం మండలంలోని తురిమెళ్ల చెరువులో నైజీరియన్ పక్షులు సందడి చేస్తున్నాయి. ఏడాదికోసారి వచ్చే వీటిని చూసేందుకు ప్రజలు తరలివస్తున్నారు. - 8లో..



సంక్షేమమే పరమావధిగా జగనన్న పాలన

పేదలందరికీ సంక్షేమ పథకాలు అందించడమే లక్ష్యంగా సీఎం పరిపాలన చేస్తున్నారని మంత్రి ఆదిమూలపు అన్నారు. - 8లో..

గరిష్టం/కనిష్టం
36/29

వాతావరణం

ఆకాశం మేఘావృతమై ఉంటుంది. చిరుజల్లులు కురిసే అవకాశం ఉంది. చల్లని గాలులు వీస్తాయి

న్యూస్‌రీల్

సీనియర్ రెసిడెంట్ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

ఒంగోలు అర్బన్: స్థానిక ప్రభుత్వ వైద్య కళాశాలలో ఖాళీగా ఉన్న సీనియర్ రెసిడెంట్ పోస్టులు భర్తీ చేసేందుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు వైద్య కళాశాల ప్రిన్సిపాల్ సుధాకర్ బాబు ఒక ప్రకటనలో తెలిపారు. వైద్య పోస్టు గ్రాడ్యుయేషన్ అర్హత కలిగిన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. దరఖాస్తును www.gmcongole.org, https://prakasam.ap.gov.in/notice category/recruitment/ నుంచి డౌన్‌లోడ్ చేసుకుని విద్యార్హత సర్టిఫికెట్లు జత చేసి rimsongole@yahoo.com, ongolegmc@gmail.com ఈ మెయిల్స్‌కు పంపాలన్నారు. అనంతరం కౌన్సెలింగ్‌కు హాజరయ్యే సమయంలో 3 అటెస్టేషన్ కాపీలు తీసుకురావాలని సూచించారు. ఆఖరుతేదీ ఈ నెల 6గా పేర్కొన్నారు.

పనిచేసే ప్రాంతంలోనే సిబ్బంది నివాసం ఉండాలి

- బీసీ సంక్షేమ శాఖ జిల్లా అధికారి అంజల

ఒంగోలు: జిల్లాలోని బీసీ సంక్షేమశాఖలో పనిచేస్తున్న సహాయ సంక్షేమశాఖ అధికారులు, వసతిగృహ సంక్షేమశాఖ అధికారులు, నాలుగో తరగతి సిబ్బంది వారు పనిచేస్తున్న ప్రదేశంలోనే నివాసం ఉండాలని జిల్లా బీసీ సంక్షేమ, సాధికారత అధికారి ఎం.అంజల ఆదేశించారు. స్థానిక బీసీ సంక్షేమశాఖ కార్యాలయంలో బుధవారం వర్క్‌షాప్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సిబ్బంది వివరాలను ఆయా వసతిగృహాల్లో ప్రదర్శించాలని, విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం, వసతి అందించాలని, ఆరోగ్య పరీక్షలు నిర్వహించాలని, విద్యార్థుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. తల్లిదండ్రుల సమావేశం నిర్వహించాలని, వివిధ అంశాలపై ప్రభుత్వ ఉత్తర్వులు తప్పకుండా పాటించాలని చెప్పారు. అందుకోసమే ఏపీ బీసీ స్టడీ సర్కిల్ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సమావేశంలో బీసీ సంక్షేమశాఖ సహాయ అధికారులు కె.శ్రీనివాసులు, షేక్ జబ్బార్, మార్కాపురం వసతి గృహ సంక్షేమశాఖ అధికారులు, కార్యాలయ పర్యవేక్షకుడు ఎం.రామశ్రీనివాస్, సిబ్బంది పాల్గొన్నారు.

మణిపూర్‌లో హింసను ఆపాలి



కొవ్వొత్తుల ప్రదర్శన నిర్వహిస్తున్న డీవైఎఫ్ఐ ప్రతినిధులు

ఒంగోలు టౌన్: మణిపూర్‌లో నెలల తరబడి కొనసాగుతున్న హింసను ఆపేందుకు కేంద్ర ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకోవాలని డీవైఎఫ్ఐ నాయకులు డిమాండ్ చేశారు. ఆ మేరకు ఒంగోలు నగరంలోని గాంధీనగర్‌లో గురువారం రాత్రి కొవ్వొత్తుల ప్రదర్శన నిర్వహించారు. కార్పొరేట్ శక్తుల జేబులో బొమ్మగా మారిన బీజేపీ ప్రభుత్వం ఉద్దేశపూర్వకంగానే మణిపూర్‌లో చిచ్చురాజేసిందని డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి కె.ఎఫ్.బాబు విమర్శించారు. దేశ ప్రజలు తలెత్తుకోలేని విధంగా అత్యాచారాలు, మహిళలను నగ్నంగా ఊరేగించడాలు లాంటి ఘోరాలు జరిగితే ప్రధానమంత్రి నరేంద్రమోదీ చోద్యం చూడటం సిగ్గుచేటన్నారు. తక్షణమే మణిపూర్‌లో శాంతి నెలకొల్పాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఐద్వా జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు సయ్యద్ షమీ, కె.రమాదేవి, కిరణ్ డానియల్ తదితరులు పాల్గొన్నారు.

కారిడార్ల ఏర్పాటుపై ఎంపీ మాగుంట ప్రశ్న

ఒంగోలు: ప్రత్యేక రైల్వే సరుకు రవాణా కారిడార్ల ఏర్పాటుపై ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాసులురెడ్డి పార్లమెంట్‌లో అడిగిన ప్రశ్నకు కేంద్ర రైల్వే, ప్రసార, ఎలక్ట్రానిక్స్, సాంకేతిక సమాచార శాఖామంత్రి అశ్విని వైష్ణవ్ సమాధానం ఇచ్చారు. దేశంలో రైలు రవాణా రంగంలో రవాణా సమర్థత పెంపుదలకు, వేగవంతమైన రవాణా సౌకర్యం కల్పనకు, ఉన్నత సగటు వేగం పెంపు సాధనకు రైల్వే మంత్రిత్వ శాఖ లూధియానా నుంచి సొన్నాగర్ వరకు 1337 కిలోమీటర్ల దూరం ఈస్టర్న్ డెడికేటెడ్ ఫ్రైట్ కారిడార్, జవహర్ లాల్ నెహ్రూ పోర్టు టెర్మినల్ నుంచి దాద్రి వరకు 1506 కిలోమీటర్లు రెండు రైలు రవాణా కారిడార్ల నిర్మాణాన్ని చేపట్టినట్లు పేర్కొన్నారు. 1337 కిలోమీటర్లకుగాను 1046 కిలోమీటర్లు, 1506 కిలోమీటర్లకుగాను 1150 కిలోమీటర్లు పూర్తిచేసి అప్పగించినట్లు చెప్పారు. మిగతా నిర్మాణ పనులు పలు రాష్ట్రాల్లో వివిధ దశల్లో ఉన్నాయన్నారు. రాష్ట్రం నుంచి వెళ్లే ఈస్ట్‌కోస్టు కారిడార్ ఖరగ్‌పూర్ నుంచి విజయవాడ వరకు, నార్త్ సౌత్ సబ్ కారిడార్ విజయవాడ–నాగపూర్–ఇటార్సీ వరకు ఏర్పాటుకు ప్రాజెక్టు నివేదికను రైల్వే మంత్రిత్వ శాఖ తయారు చేస్తున్నట్లు కేంద్ర మంత్రి పేర్కొన్నారు.

కరెంటు కష్టాలకు చెక్

ప్రభుత్వం 24 గంటలూ కరెంటు ఇస్తున్నా గ్రామీణ ప్రాంతాల్లో తరచూ అంతరాయాలు.. లో వోల్టేజీ.. సరఫరాలో లోపాలు తలెత్తుతున్నాయి. వీటిపై ఇక ఎలాంటి చింత లేకుండా సమస్యలు పరిష్కరిస్తూ నిరంతరాయంగా విద్యుత్ సరఫరా చేసేందుకు విద్యుత్ శాఖ చర్యలు చేపడుతోంది. రివ్యాంప్డ్ డిస్ట్రిబ్యూషన్ సెక్టార్ స్కీమ్ (ఆర్‌డీఎస్ఎస్) ద్వారా సమస్యలకు చెక్ పెట్టనుంది. ఉమ్మడి ప్రకాశం జిల్లాలో రూ.844 కోట్లతో ఈ పనులు జరగనున్నాయి. తొలి విడతగా రూ.38 కోట్లతో 35 గ్రామాల్లో అధికారులు పనులు చేపడుతున్నారు.



కాశీపురంలో చేపట్టిన విద్యుత్ ఆధునికీకరణ పనులు

- గ్రామాల్లో విద్యుత్ సరఫరా వ్యవస్థ ఆధునికీకరణ
- ఉమ్మడి ప్రకాశం జిల్లాలోని 12 నియోజకవర్గాల్లో పనులు
- ఆర్‌డీఎస్ పథకం కింద రూ.844 కోట్ల కేటాయింపు
- తొలుత రూ.38 కోట్లతో 35 గ్రామాల్లో పనులు
- కనిగిరి మున్సిపాలిటీ పరిధి కాశీపురంలో ట్రైల్ రన్
- వచ్చే వారంలో అధికారికంగా పనులు

కనిగిరి రూరల్: గ్రామీణ ప్రాంతాల్లో విద్యుత్ పంపిణీ వ్యవస్థను మెరుగుపరిచేందుకు చేపట్టిన సర్వే పనులు పూర్తి కావచ్చాయి. ఉమ్మడి ప్రకాశం జిల్లాలోని 12 నియోజకవర్గాల్లో 309 సబ్‌స్టేషన్ల పరిధిలో ఆర్‌డీఎస్ఎస్ స్కీమ్ కింద సుమారు రూ.844 కోట్లతో గ్రామీణ ప్రాంతాల్లో త్రీఫేజ్ సరఫరా, విద్యుత్ ఆధునికీకరణ పనులు చేపట్టేందుకు సర్వే చేపట్టారు. మరోవైపు రూ.38 కోట్లతో 5 వేల జనాభా కంటే అధికంగా ఉన్న 35 గ్రామాల్లో త్రీఫేజ్ విద్యుద్దీకరణ, నూతన విద్యుత్ పోల్స్ ఏర్పాటు, తదితర విద్యుత్ అభివృద్ధి పనులు వారంలో ప్రారంభం కానున్నాయి. ఈ పథకానికి సంబంధించి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వాటా (60 శాతం, 40 శాతం)తో పనులు జరగనుండగా, తొలుత రాష్ట్ర ప్రభుత్వానికి సంబంధించి రూ.38 కోట్ల నిధులతో పనులు చేపడుతున్నట్లు అధికారులు వెల్లడించారు. రెండేళ్లల్లో ఈ ప్రాజెక్టు పనులు పూర్తి చేయాల్సి ఉంది. కనిగిరి పట్టణంలోని కాశీపురం గ్రామంలో ట్రైల్ రన్ పనులు చేపట్టారు. వచ్చే వారంలో అధికారికంగా పనులకు శ్రీకారం చుట్టనున్నారు.

జరిగే పనులు ఇలా...

ఈ పథకం ద్వారా కొత్త ట్రాన్స్‌ఫార్మర్ల ఏర్పాటు, విద్యుత్ లైన్ మార్పిడి, త్రీఫేజ్ విద్యుత్ సరఫరా, అగ్రికల్చర్ లైన్ నుంచి గృహవిద్యుత్ సరఫరా లైన్‌ను పూర్తిగా వేరు చేయడం, సింగిల్ ఫేజ్ 16 కేవీ ట్రాన్స్‌ఫార్మర్లు తొలగించి వాటి స్థానంలో 100 కేవీ ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేయడం, కండక్టర్, ఏబీ వైరును పూర్తిగా పాత 34 స్క్వేర్ ఎంఎం నుంచి 55 స్క్వేర్ ఎంఎంకు మార్చడం తదితర విద్యుత్ ఆధునికీకరణ పనులు చేపట్టనున్నారు. ఒక గ్రామాన్ని ఒక యూనిట్‌గా తీసుకుని సుమారు రూ.కోటి వరకు నిధులు వెచ్చించి విద్యుత్ ఆధునికీకరణ పనులు చేస్తారు. ప్రధానంగా అగ్రికల్చర్ లైన్ నుంచి గ్రామాలను వేరు చేసి ప్రత్యేక విద్యుత్ లైన్ ఏర్పాటుకు ప్రాధాన్యత ఇవ్వనున్నారు.

35 గ్రామాలు ఇవే...

తొలి దశలో ఉమ్మడి ప్రకాశం జిల్లా పరిధిలోని 35 గ్రామాల్లో ఈ పనులు చేపట్టనున్నారు. ఒంగోలు రూరల్ మండలం పరిధిలో దేవరంపాడు, గుండాయపాలెం, కొత్తపట్నం మండలంలో పాదర్తి, రంగాయపాలెం, మద్దిపాడు మండలంలో ఇనమనమెళ్లూరు, బసవన్నపాలెం, నందిపాడు, ఉలవపాడు మండలంలో చాకిరాల, కే రాజుపాలెం, కొల్లుపాడు, కందుకూరు రూరల్‌లో పలుకూరు, ఇంకొల్లు మండలంలో పావులూరు, చీరాల రూరల్‌లో గోవిందవారిపాలెం, పర్చూరులో ఉప్పుటూరు, అద్దంకి రూరల్‌లో ధర్మవరం, కలవకూరు, మేదరమెట్లలో బొద్దువారిపాలెం, రావినూతల, పమిడిపాడు, జే పంగులూరులో కొండమాగులూరు, జే పంగులూరు, మార్టూరులో బొబ్బేపల్లి, వలపర్ల, ద్రోణాదుల, కనిగిరి టౌన్‌లో మాచవరం, కాశీపురం, కాశిరెడ్డికాలనీ, చింతలపాలెం, త్రిపురాంతకంలో మెడపి, గంగవరం, కంభంలో తురిమెళ్ల, వై.పాలెంలో ఏజీ పాడు, గిద్దలూరులో అంబవరం, పుల్లలచెరువు మండలంలో ఐటీ వరం గ్రామాల్లో విద్యుత్ ఆధునికీకరణ పనులు జరగనున్నాయి.



నూతనంగా వచ్చిన విద్యుత్ వైర్లు

ప్రయోజనాలు...

గ్రామాల్లో ప్రధానంగా త్రీఫేజ్ విద్యుత్ సరఫరా అవుతోంది. దీంతో గ్రామీణ ప్రాంతాల్లో కూడా చిన్నతరహా కుటీర పరిశ్రమలు ఏర్పాటు చేసుకోవచ్చు. అన్ని గ్రామాల్లో అగ్రికల్చర్ లైన్, గృహాల విద్యుత్ లైన్ వేర్వేరుగా ఉంటాయి. దీంతో గ్రామాల్లో 24 గంటల విద్యుత్ సరఫరా జరుగుతోంది. అంతేగాకుండా ట్రాన్స్‌ఫార్మర్ల కెపాసిటీ పెంచడం వలన విద్యుత్ నష్టం తగ్గి విద్యుత్ ఆదా జరుగుతుంది. తరచూ విద్యుత్ సరఫరాకు అంతరాయం లేకుండా పురాతనకాలం నాటి కాలంచెల్లిన విద్యుత్ వైర్లు తొలగించి ఆధునాతన కండక్టర్ వైర్లను ఏర్పాటు చేస్తారు. గతంలో ఉన్న విద్యుత్ పోల్స్ (8 మీటర్ల పొడవు) తొలగించి కొత్త పోల్స్ (9.1 మీటర్ల పొడవు) ఏర్పాటు చేస్తారు.



పనులను పర్యవేక్షిస్తున్న కనిగిరి మున్సిపల్ చైర్మన్ గఫార్

వారంలో పనులు ప్రారంభిస్తాం



రూ.38 కోట్ల స్కీంలో చేపట్టే విద్యుత్ ఆధునికీకరణ పనులను వచ్చే వారంలో ప్రారంభిస్తాం. ఉమ్మడి ప్రకాశం జిల్లాలోని 35 గ్రామాలను ఒక్కో యూనిట్‌గా తీసుకుని సుమారు రూ.కోటి వరకు అభివృద్ధి పనులు చేస్తాం. అలాగే ఆర్‌డీఎస్ఎస్ స్కీం పనులు ఉమ్మడి ప్రకాశం జిల్లాలోని 12 నియోజకవర్గాల్లో అన్ని గ్రామాల్లో రూ.844 కోట్లతో జరుగుతాయి. ఈ స్కీం సర్వే పనులు చివరి దశలో ఉన్నాయి. వచ్చే నెలలో పనులు ప్రారంభిస్తాం. ఉమ్మడి ప్రకాశం జిల్లాలోని 309 సబ్‌స్టేషన్ల పరిధిలోని 640 వ్యవసాయ ఫీడర్లలో 24 గంటల విద్యుత్ సరఫరా లక్ష్యంగా విద్యుత్ ఆధునికీకరణ పనులు చేపడతాం.

– కేవీజీ సత్యన్నారాయణ, ఎస్ఈ, ఒంగోలు

సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి రుణపడి ఉంటా



సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అభివృద్ధి, సంక్షేమం రెండుకళ్లుగా పరిపాలన సాగిస్తున్నారు. రెండు స్కీంల కింద గ్రామీణ ప్రాంతాల్లో 24 గంటల విద్యుత్ సరఫరా, రైతులు, ప్రజలకు నాణ్యమైన, మెరుగైన విద్యుత్ సరఫరాకు ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. అందులో భాగంగా కనిగిరి నియోజకవర్గంలో అన్ని గ్రామాల్లో సుమారు రూ.74 కోట్లతో విద్యుత్ ఆధునికీకరణ పనులు త్వరలో చేపట్టనున్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆశీసులు, సహకారంతో నియోజకవర్గాన్ని మరింత అభివృద్ధి చేస్తా. నియోజకవర్గ ప్రజలకు, సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ఎల్లప్పుడూ రుణపడి ఉంటాం.

– బుర్రా మధుసూదన్‌యాదవ్, కనిగిరి ఎమ్మెల్యే, టీటీడీ పాలకమండలి సభ్యుడు

జగనన్న ప్రభుత్వంలో మహిళలకు ప్రాధాన్యత



వైఎస్సార్ సంపూర్ణ పోషణ కిట్లు అందజేస్తున్న మంత్రి ఆదిమూలపు సురేష్

- రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖామంత్రి ఆదిమూలపు సురేష్

యర్రగొండపాలెం: జగనన్న ప్రభుత్వంలో మహిళలకు అధిక ప్రాధాన్యత ఇస్తున్నట్లు రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖామంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్ అన్నారు. స్థానిక ప్రసన్నాంజనేయస్వామి కల్యాణ మండపంలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో గురువారం ఏర్పాటు చేసిన వైఎస్సార్ సంపూర్ణ పోషణ కిట్ల పంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి మహిళల పక్షపాతి కావడం వలన వారు ఆర్థికంగా ఎదిగి వారికాళ్లపై నిలబడేందుకు అవసరమైన పథకాలన్నీ అందజేస్తున్నారని తెలిపారు. అంతేగాకుండా మహిళలు ఆరోగ్యంగా ఉండేందుకు తగిన చర్యలు తీసుకుంటున్నారని చెప్పారు. ఇంటికి ఒక పెద్ద కొడుకుగా, అన్నగా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రత్యేక శ్రద్ధపెట్టి సంపూర్ణ పోషణ కిట్లు అందిస్తున్నారన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నపిల్లలకు అన్ని సదుపాయాలు కల్పించడం జరిగిందని, వారికి మంచి ఆహారాన్ని అందించడమే కాకుండా విద్యాపరంగా ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నామని మంత్రి వివరించారు. అంగన్‌వాడీ కేంద్రాల నిర్వహణకు సొంత భవనాలు లేనిచోట వెంటనే స్థలాలు కేటాయించి భవనాల నిర్మాణాలకు ప్రభుత్వం నిధులు విడుదల చేస్తోందని తెలిపారు. పిల్లలతో పాటు గర్భిణులు, బాలింతల ఆరోగ్య పరిరక్షణ కోసం వైద్య సిబ్బందిని నియమించి పరీక్షలు చేయిస్తున్నామని తెలిపారు. పిల్లలకు తల్లిపాలు ఇవ్వడం మర్చిపోరాదని, డబ్బా పాలు తాగిస్తే వారి ఆరోగ్యం దెబ్బతినే అవకాశం ఉందని మంత్రి హెచ్చరించారు. గత టీడీపీ పాలనలో అంగన్‌వాడీ కేంద్రాలు అస్తవ్యస్తంగా ఉండేవని, కనీసం చిన్నపిల్లలు కూర్చోవడానికి వసతులు కూడా కల్పించలేని దౌర్భాగ్యపు పరిస్థితులు ఉండటం వలన కేంద్రాలకు పిల్లలను పంపించేవారు కాదని మంత్రి గుర్తుచేశారు. ప్రస్తుతం జగనన్న పాలనలో అటువంటి పరిస్థితులు లేవన్న విషయాన్ని ప్రతిఒక్కరూ గుర్తించారని, జగనన్నే మా భవిష్యత్తు.. ఆయనే మరోసారి ముఖ్యమంత్రి అనే నినాదాలతో మహిళలు ఉన్నారని మంత్రి అన్నారు. అనంతరం బాలింతలు, గర్భిణులకు వైఎస్సార్ సంపూర్ణ కిట్లను మంత్రి సురేష్ చేతుల మీదుగా అందజేశారు. గర్భిణులకు సీమంతాలు చేశారు. కార్యక్రమంలో జిల్లా స్త్రీ, శిశు సంక్షేమ శాఖాధికారిణి కె.మాధురి, సీడీపీవో బి.పద్మ, డీఎల్‌డీవో బీవీఎస్ సాయికుమార్, తహసీల్దార్ కె.రవీంద్రరెడ్డి, ఎంపీడీవో వై.వి.నాగేశ్వరప్రసాద్, ఈవోఆర్డీ ఈదుల రాజశేఖరరెడ్డి, ఏఎంసీ చైర్మన్ ఉడుముల శ్రీనివాసరెడ్డి, ఎంపీపీ దొంతా కిరణ్‌గౌడ్, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్లు కె.ఓబుల రెడ్డి, బి.వి.సుబ్బారెడ్డి, సచివాలయాల మండల కన్వీనర్ సయ్యద్ జబీవుల్లా, వివిధ విభాగాల నాయకులు ఎస్.వెంకటరెడ్డి, రాములునాయక్, బి.బాలచెన్నయ్య పాల్గొన్నారు.

దళితులను చిన్నచూపు చూడటం తగదు...

ప్రజల సమస్యలు తెలుసుకోవడానికి ప్రభుత్వం ఏర్పాటు చేసిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని అడ్డుకోవడం హేయమైన చర్య అని, దళితులను చిన్నచూపు చూడటం తగదని మంత్రి ఆదిమూలపు సురేష్ అన్నారు. ఈ నెల 1వ తేదీ ఒంగోలు 41వ డివిజన్ పేర్నమిట్టలో సంతనూతలపాడు ఎమ్మెల్యే టీజేఆర్ సుధాకర్‌బాబు గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తున్న సమయంలో టీడీపీ కార్యకర్తలు అడ్డుకోవడం ఎంత వరకు సమంజసమని ఆయన ప్రశ్నించారు. గురువారం యర్రగొండపాలెంలోని తన క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో పేర్నమిట్ట సంఘటనను మంత్రి తీవ్రంగా ఖండించారు. రాజకీయంగా ఎదుర్కోలేక దళిత ఎమ్మెల్యేను వీధుల్లోకి రానీయకుండా చేయడంతో పాటు దాడులకు దిగడం దుర్మార్గమైన చర్య అని అన్నారు. దళితులను చిన్నచూపు చూసే భావాజాలాన్ని విడనాడాలని ఆయన సూచించారు. సుధాకర్‌బాబుకు తాము అండగా ఉంటామని, ప్రభుత్వ కార్యక్రమాన్ని అడ్డుకున్న నిందితులపై కలెక్టర్, ఎస్పీ చర్యలు తీసుకోవాలని ఆయన అన్నారు.

సజ్జల దృష్టికి పేర్నమిట్ట ఘటన



సజ్జల రామకృష్ణారెడ్డితో మాట్లాడుతున్న ఎమ్మెల్యే టీజేఆర్ సుధాకర్‌బాబు, నాయకులు

- తాడేపల్లిలో కలిసి తెలియజేసిన ఎమ్మెల్యే టీజేఆర్
- చట్టపరమైన చర్యలు తీసుకుంటామని సజ్జల భరోసా

చీమకుర్తి: సంతనూతలపాడు ఎమ్మెల్యే టీజేఆర్ సుధాకర్‌బాబు గురువారం తాడేపల్లిలో ప్రభుత్వ ప్రధాన సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డిని కలిశారు. మంగళవారం ఒంగోలు 41వ డివిజన్ పేర్నమిట్టలో ఎమ్మెల్యే నిర్వహిస్తున్న గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని టీడీపీ గూండాలు అడ్డుకున్న వివరాలను సజ్జలకు తెలిపారు. ప్రభుత్వ పథకాలను వివరించి ప్రజల సమస్యలు తెలుసుకునేందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి శ్రీకారం చుట్టిన గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమానికి ప్రజల నుంచి మంచి స్పందన వస్తోందని సజ్జల రామకృష్ణారెడ్డి తెలిపారని ఎమ్మెల్యే వెల్లడించారు. గడపగడపను అడ్డుకున్న వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని సజ్జల భరోసా ఇచ్చారని చెప్పారు. ఇలాంటి దాడులు పునరావృతమైతే సహించేది లేదని సజ్జల స్పష్టం చేసినట్లు ఎమ్మెల్యే తెలిపారు. ఎమ్మెల్యే వెంట వైఎస్సార్ సీపీ సంతనూతలపాడు మండల కన్వీనర్ దుంపా చెంచిరెడ్డి, మద్దిపాడు ఎంపీపీ వాకా అరుణ కోటిరెడ్డి, నాయకుడు నారా శ్రీనివాసరెడ్డి, జేసీఎస్ కన్వీనర్ కొమ్మూరి సుధాకర్, త్యాగరాజు, గృహనిర్మాణ శాఖ డైరెక్టర్ కొలకలూరి విజయ్‌కుమార్, బందారు సురేష్ ఉన్నారు.

రోగుల నుంచి ఫిర్యాదులొస్తే కఠిన చర్యలు

- అవినీతి ఆరోపణలు లేకుండా అంకితభావంతో పనిచేయాలి
- జీజీహెచ్ సూపరింటెండెంట్ భగవాన్ నాయక్



సమావేశంలో మాట్లాడుతున్న జీజీహెచ్ సూపరింటెండెంట్ భగవాన్ నాయక్

ఒంగోలు అర్బన్: వైద్యసిబ్బంది సరైన సేవలు అందించడం లేదని, నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని రోగుల నుంచి ఫిర్యాదులొస్తే కఠిన చర్యలు తీసుకుంటామని స్థానిక జీజీహెచ్ సూపరింటెండెంట్ భగవాన్ నాయక్ హెచ్చరించారు. జీజీహెచ్‌లోని గైనిక్, ఆపరేషన్, ఓపీ విభాగాల సిబ్బందితో గురువారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోగులకు అసౌకర్యం కలిగితే సహించేది లేదని, అవినీతి ఆరోపణలను తీవ్రంగా పరిగణించి కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. రోగుల పట్ల మానవత్వంతో, అంకితభావంతో పనిచేయాలన్నారు. ఎక్కువ శాతం సిబ్బంది సరైన సేవలు అందిస్తున్నప్పటికీ ఒకరిద్దరు పొరపాట్లు చేయడం వల్ల అందరికీ చెడ్డ పేరు వస్తుందన్నారు. ప్రతిఒక్కరూ బాధ్యతగా విధులు నిర్వహించాలన్నారు. శాఖల అధిపతులు నిరంతరం పర్యవేక్షించాలని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం వైద్య రంగానికి అధిక ప్రాధాన్యం ఇస్తోందని, ఆ మేరకు ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని ఆదేశించారు. సమావేశంలో ఆర్ఎంఓ డాక్టర్ చైతన్యవర్మ, డిప్యూటీ ఆర్ఎంఓ డాక్టర్ మాధురి, డాక్టర్ సంధ్యారాణి, నర్సింగ్ సూపరింటెండెంట్ తదితరులు పాల్గొన్నారు.

ఎంపీ మాగుంట రాక రేపు

ఒంగోలు: ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాసులు రెడ్డి ఈ నెల 5, 6 తేదీల్లో ఒంగోలులో జరిగే పలు కార్యక్రమాల్లో పాల్గొంటారని ఎంపీ కార్యాలయ ప్రతినిధి భవనం సుబ్బారెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. 5వ తేదీ ఉదయం 10 గంటలకు స్థానిక జవహర్ నవోదయ విద్యాలయ సమితి ఆవరణలో జరిగే ప్రాంతీయ స్థాయి బాక్సింగ్ సమావేశ ముగింపు కార్యక్రమంలో పాల్గొంటారు. 6వ తేదీ ఉదయం 9 గంటలకు అమృత్ భారత్‌స్టేషన్ పథకం కింద రైల్వేస్టేషన్ల ఆధునికీకరణ, వసతులు ఏర్పాటుకు ఎంపికైన ఒంగోలు రైల్వే స్టేషన్‌కు సంబంధించి ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఆన్‌లైన్ పనుల ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాల్గొంటారు. మిగిలిన సమయంలో స్థానికంగా పలు కార్యక్రమాల్లో పాల్గొనడంతో పాటు ప్రజలు, నాయకులు, అభిమానులకు అందుబాటులో ఉంటారు.

పాల ఉత్పత్తి పెంచాలి



మాట్లాడుతున్న పశుసంవర్ధకశాఖ జేడీ బేబీరాణి

- పశువులకు పొదుగు వాపు వ్యాధి రాకుండా చర్యలు తీసుకోవాలి
- పశుసంవర్ధకశాఖ జేడీ బేబీరాణి

ఒంగోలు సిటీ: పాడి పశువుల్లో పొదుగు వాపు వ్యాధి కారణంగా పాల ఉత్పత్తి తగ్గుతోందని పశుసంవర్ధకశాఖ జేడీ బేబీరాణి తెలిపారు. పాడి రైతులు ముందుగా ఆ వ్యాధిని గుర్తించి నివారణ చర్యలు చేపట్టాలని సూచించారు. స్థానిక డీఎల్‌డీఏ మీటింగ్ హాలులో గురువారం జిల్లా పశుసంవర్ధకశాఖలో పనిచేస్తున్న ఉపసంచాలకులు, సహాయ సంచాలకులు, పశువైద్యులు, రాష్ట్రీయ నేషనల్ మిషన్ వారి సౌజన్యంతో పొదుగు వాపు వ్యాధి నివారణ చర్యలు, ఆవశ్యకతపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా బేబీరాణి మాట్లాడుతూ పొదుగు వాపు వ్యాధి వలన పాల ఉత్పత్తి తగ్గి రైతులకు నష్టం వస్తుందన్నారు. ఈ వ్యాధిని త్వరగా గుర్తించి పశువైద్యుడిని సంప్రదించి మంచి మందులు వాడి తగ్గించుకోవచ్చని తెలిపారు. తద్వారా పాల ఉత్పత్తి పెంచుకోవాలని సూచించారు. పొదుగు వాపు వ్యాధి నివారణకు తీసుకోవాల్సిన చర్యలపై చీమకుర్తి పశువైద్యుడు సీహెచ్ వెంకటరెడ్డి అవగాహన కల్పించారు.

కార్యక్రమంలో కార్యనిర్వహణాధికారి డీఎల్‌డీఏ డాక్టర్ కాలేషా, ఉపసంచాలకులు డాక్టర్ రమేష్, డాక్టర్ వెంకటసుబ్బయ్య, డాక్టర్ పద్మావతి, ఐఎస్‌డీపీ సహాయ సంచాలకులు డాక్టర్ వెంకటరెడ్డి పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఏకేయూ ఫార్మసీలో సభ్యుడిగా జయరావు

మార్కాపురం టౌన్: ఒంగోలులోని ఆంధ్రకేసరి యూనివర్సిటీలో ఫార్మసీ విభాగంలో బోర్డ్ ఆఫ్ స్టడీస్‌లో మెంబర్‌గా మార్కాపురంలోని డాక్టర్ సామ్యేల్ జార్జ్ ఫార్మసీ కళాశాల ప్రిన్సిపాల్ జయరావు నియమితులయ్యారు. ఈ మేరకు గురువారం ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. మూడేళ్లపాటు ఆయన ఈ పదవిలో కొనసాగుతారు. ఈ సందర్భంగా ఆయనను కళాశాల డైరెక్టర్ డాక్టర్ ఆదిమూలపు సతీష్ అభినందించారు.

నేడు సింగరాయకొండలో మెగా జాబ్ మేళా

సింగరాయకొండ: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, సీడాప్, జిల్లా ఉపాధి కార్యాలయం సంయుక్తాధ్వర్యంలో వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి వరికూటి అశోక్‌బాబు సహకారంతో స్థానిక ప్రభుత్వ జూనియర్ కాలేజీలో శుక్రవారం మెగా జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారులు పేర్కొన్నారు. జాబ్‌మేళాలో 15 ప్రముఖ కంపెనీలు పాల్గొంటున్నట్లు గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. పదో తరగతి నుంచి పీజీ వరకు చదివి, 18 నుంచి 35 ఏళ్ల మధ్య వయసున్న యువతీయువకులు జాబ్‌మేళాలో పాల్గొనవచ్చని స్పష్టం చేశారు. వివరాలకు 8008986256, 8125215216ను సంప్రదించాలని సూచించారు.

వాగులో జారిపడి యువకుడు మృతి


మృతుడు సుబ్రహ్మణ్యం

కనిగిరి రూరల్: చేపల వేటకు వెళ్లిన యువకుడు ప్రమాదవశాత్తు నీట మునిగి మృతి చెందాడు. ఈ సంఘటన గురువారం కనిగిరి మండలంలోని యడవల్లిలో చోటుచేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన జి.సుబ్రహ్మణ్యం చేనేత మగ్గం నేయడంతోపాటు వస్త్ర వ్యాపారం చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. గురువారం సరదాగా చేపలు పట్టడానికి సమీపంలోని చాకిరేవు వాగు వద్దకు వెళ్లారు. వల వేసి తీసే క్రమంలో వాగులోని గుంతలో జారి పడ్డాడు. పూడులో ఇరుక్కోవడంతో బయటకు రాలేక చనిపోయాడు. మృతుడికి భార్య, ముగ్గురు పిల్లలు ఉన్నారు. సరదాగా చేపల వేటకు వెళ్లిన సుబ్రహ్మణ్యం విగతజీవిగా ఇంటికి చేరడంతో భార్య సుశీల, కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరయ్యారు.

కుక్కల దాడిలో పది మేకపిల్లలు మృతి



అర్ధవీడు(కంభం): కుక్కల దాడిలో పది మేక పిల్లలు మృతి చెందాయి. ఈ సంఘటన మండలంలోని కాకర్ల గ్రామంలో గురువారం జరిగింది. వివరాల్లోకి వెళితే..గ్రామానికి చెందిన కోటయ్య మేకలను అడవికి మేతకు తీసుకెళ్తూ పది మేక పిల్లలను దొడ్లో ఉంచి వెళ్లాడు. సాయంత్రి తిరిగి వచ్చే సరికి అవి చనిపోయి పడి ఉన్నాయి. కుక్కలు దాడి చేసి తన మేక పిల్లలను చంపేసాయని బాధితుడు లబోదిబోమంటున్నాడు.

తప్పిపోయిన చిన్నారి తల్లిదండ్రుల చెంతకు

- గంటలోపే పాప ఆచూకీ కనుగొన్న పోలీసులు


పాపను తల్లిదండ్రులకు అప్పగిస్తున్న టూటౌన్ సీఐ సోమశేఖర్

చీరాల: తప్పిపోయిన చిన్నారి ఆచూకీని గంటలోపే కనుగొని పోలీసులు పాపను తల్లిదండ్రుల చెంతకు చేర్చారు. వివరాల్లోకి వెళితే.. పట్టణంలోని నోవాహుపేటకు చెందిన కాకి వినోద్ కుమార్ తన ఐదేళ్ల చిన్నారి విషిత రూత్ గురువారం సాయంత్రం 7గంటల నుంచి కనిపించ లేదు. దీంతో పలు చోట్ల వెతికినా ఆచూకీ లభించకపోవడంతో 112 కాల్ సెంటర్‌కు కాల్ చేశాడు. కాల్ సెంటర్ నుంచి వచ్చిన సమాచారంతో టూటౌన్ సీఐ జీ సోమశేఖర్ విషయాన్ని జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్, డీఎస్పీ ప్రసాదరావుకు తెలిపారు. వారి ఆదేశాల మేరకు రెండు బృందాలను ఏర్పాటు చేసి దర్యాప్తును వేగవంతం చేశారు. ఒక బృందం సీసీ కెమెరాలను క్షుణ్ణంగా పరిశీలించగా, మరో బృందం వాహనాలను తనిఖీ చేశారు. తనిఖీల్లో చిన్నారి ఆటోలో ఉండడాన్ని గమనించి ఆటో డ్రైవర్ డేనియల్‌ను ప్రశ్నించారు. పాప రోడ్డుకు అడ్డం రావడంతో చిన్నారి వాళ్ల ఇంటి దగ్గర దింపమని అడిగిందని, ఈ సందర్భంలో పాపను ఆటోలో ఎక్కించుకుని వెళ్లినట్లు తెలిపాడు. సీఐ ఆపాప తల్లిదండ్రులను పోలీస్‌స్టేషన్‌ను పిలిపించి వారికి అప్పగించారు. తల్లిదండ్రులు తమ పిల్లలను నిరంతరం గమనిస్తూ ఉండాలని, అశ్రద్ధ వహించవద్దని సీఐ సూచించారు. ఏ సమస్య వచ్చినా 100, 112 నంబర్లుకు, బాపట్ల జిల్లా ఎస్పీ హెల్ప్‌లైన్ నెంబర్ 83338 13228కు కాల్ చేయాలన్నారు. పాప ఆచూకీని కనుగొనడంతో టూటౌన్ సీఐ, మహిళా ఎస్సై చంద్రావతి, హెడ్ కానిస్టేబుల్ ఎస్‌కె బాజీత్, డి.శివప్రసాద్, కానిస్టేబుళ్లు ఎం.శ్రీనివాసులు, బాలశంకర్, సిబ్బందిని జిల్లా ఎస్పీ అభినందించారు.




విహంగ విలాసం!

తురిమెళ్ల చెరువులో సందడి చేస్తున్న నైజీరియన్ పక్షులు



కంభం: నైజీరియన్ పక్షులు ఖండాలు దాటి కంభం పరిసర ప్రాంతాలకు చేరుకున్నాయి. సుమారు 5 వేల కిలోమీటర్లు ప్రయాణించి కంభం మండలంలోని తురిమెళ్ల చెరువుకు చేరుకున్న పక్షులను తిలకించేందుకు స్థానికులతోపాటు చుట్టుపక్కల గ్రామాల ప్రజలు తరలివస్తున్నారు. ఏడాదికోసారి ఉభయ తెలుగు రాష్ట్రాల్లోని వివిధ ప్రాంతాల్లో విడిది చేసే పక్షులు గతంలో ఎన్నడూ లేని విధంగా కంభం పరిసర ప్రాంతాలకు రావడంతో స్థానికులు ఒకింత ఆశ్చర్యానికి గురవుతున్నారు.

సంక్షేమమే పరమావధిగా జగనన్న పాలన

- వ్యవసాయానికి అండ రైతు భరోసా
- రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి ఆదిమూలపు సురేష్


లబ్ధిదారుడికి బుక్‌లెట్ అందిస్తున్న మంత్రి ఆదిమూలపు సురేష్

యర్రగొండపాలెం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజలకు సంక్షేమ పాలన అందిస్తున్నారని, దేశంలో ఎక్కడాలేని విధంగా సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టి పేదలను ఆదుకుంటున్నారని రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్ అన్నారు. మండలంలోని వెంకటాద్రిపాలెంలో గురువారం జరిగిన గడప గడపకు మన ప్రభుత్వంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చిన తరువాత నవరత్నాల పథకాన్ని అమలు చేస్తున్నారని, గతంలో ఎన్నడూ లేని విధంగా పథకాల అమలు గురించి క్యాలెండర్ విడుదల చేసి కుల, మత, వర్గ, పార్టీలకు అతీతంగా సంక్షేమ పథకాలు అందేలా చర్యలు తీసుకుంటున్నారని తెలిపారు. గత నాలుగేళ్ల కాలంలో సంక్షేమ పథకాల ద్వారా రూ.7 లక్షలకు పైబడి లబ్ధి పొందిన పేదలు ఉన్నారని, ఇంకా ప్రజలకు ఏమైనా అవసరాలు ఉంటాయన్న ఉద్దేశంతో ముఖ్యమంత్రి గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం పెట్టి తమ వద్దకు పంపిస్తున్నారన్నారు. ప్రజలు తమకు కావాల్సిన అవసరాలను చెప్పుకుంటుంటే నిలదీస్తున్నారని ఎల్లో మీడియా పనికట్టుకొని ప్రచారం చేస్తున్నాయని మండిపడ్డారు. రాష్ట్రాన్ని భ్రష్టు పట్టించిన చంద్రబాబునాయుడిని ఏదో ఒక విధంగా అధికారం కట్టబెట్టాలన్న ఆలోచనతో ఆ మీడియా తమ శాయశక్తులు ప్రయత్నిస్తున్నాయని, ఈ ప్రయత్నాలు రాష్ట్ర ప్రజలు గమనిస్తున్నారని, ప్రజలే వారికి తగిన బుద్ధి చెబుతారన్నారు. ప్రజా సంక్షేమ పథకాలను ప్రజలకు సక్రమంగా అందించాలన్న ఉద్దేశంతో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి వలంటీర్ల వ్యవస్థను ప్రవేశపెడితే వారిని పార్టీ వ్యవహారాలకు ఉపయోగించుకుంటున్నారని పచ్చనేతలు దుర్మార్గపు ప్రచారం చేస్తున్నారని విమర్శించారు.

వ్యవసాయానికి అండ రైతు భరోసా

వైఎస్సార్ రైతు భరోసా వ్యవసాయానికి అండగా ఉండేందుకు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి క్రమం తప్పకుండా రైతుల అకౌంట్లలో డబ్బులు జమ చేస్తున్నారని మంత్రి అన్నారు. అన్ని వర్గాలు చెందిన రైతులతోపాటు అటవీ భూములు హక్కు పొందిన గిరిజనులు, కౌలు రైతులకు జగనన్న ప్రతి ఏడాది రూ.13,500 విడతల వారీగా అందిస్తున్నారన్నారు. ప్రకృతి వైపరీత్యాలతో నష్టపోయిన రైతులకు తక్షణమే నష్ట పరిహారం అందించేలా చర్యలు తీసుకున్నారని పేర్కొన్నారు. గత టీడీపీ ప్రభుత్వ కాలంలో రైతులు అనేక ఇబ్బందులకు గురయ్యారని, అప్పుల బాధతో అనేక మంది రైతులు ఆత్మహత్యలు చేసుకున్నారని, ఇటువంటి తరుణంలో రైతు కుటుంబాలకు అండగా ఉండాల్సిన చంద్రబాబు వ్యవసాయం దండగ అంటూ ప్రకటించిన దుర్మార్గుడని ధ్వజమెత్తారు. 2019 ప్రారంభం నుంచే జగనన్న నేతృత్వంలో రాష్ట్రంలోని రైతులు వ్యవసాయాన్ని పండుగ చేసుకుంటున్నారని ప్రజల హర్షధ్వానాల మధ్య అన్నారు. రాష్ట్రంలో అమలు అవుతున్న సంక్షేమ పథకాలు కొనసాగాలంటే తిరిగి జగన్‌మోహన్‌రెడ్డిని సీఎంగా చేసుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ ఉడుముల శ్రీనివాసరెడ్డి, ఎంపీపీ దొంతా కిరణ్‌గౌడ్, పార్టీ మండల అధ్యక్షుడు కె.చిన్నఓబులరెడ్డి, సచివాలయాల మండల కన్వీనర్ సయ్యద్ జబీవుల్లా, డీఎల్‌డీఓ టీవీఎస్ సాయికుమార్, తహసీల్దార్ రవీంద్రరెడ్డి, ఎంపీడీఓ వైవీ నాగేశ్వరప్రసాద్, హౌసింగ్ డీఈ రమేష్‌బాబు, వివిధ శాఖల ఏఈలు సుబ్బయ్య, శ్రీకాంత్, అంజిరెడ్డి, అల్లూరయ్య పాల్గొన్నారు.

హోటల్ సిబ్బంది దాడిలో వ్యక్తి మృతి


రెస్టారెంట్ సిబ్బంది దాడిలో మృతి చెందిన వెంకటరావు

ఒంగోలు టౌన్: అర్ధరాత్రి హోటల్ వెనక సంచరిస్తున్న ఇద్దరు వ్యక్తులను దొంగలుగా భావించిన హోటల్ సిబ్బంది పట్టుకొని కొట్టడంలో వ్యక్తి మృతి చెందాడు. పోలీసుల కథనం ప్రకారం.. పెళ్లూరు వెళ్లే మార్గంలో జాతీయ రహదారికి పక్కన ఉన్న ఒక రెస్టారెంట్ వెనక బుధవారం అర్ధరాత్రి ఇద్దరు గుర్తు తెలియని వ్యక్తులు సంచరిస్తుండడాన్ని సిబ్బంది గమనించారు. రెస్టారెంట్‌లో గతంలో రెండుసార్లు బిర్యానీ పాత్రలు చోరీకి గురై ఉండడంతో వారిని దొంగలుగా భావించారు. వారిద్దరిని పట్టుకుని ప్రశ్నించే క్రమంతో దాడి చేసి కొట్టారు. దీంతో ఒక వ్యక్తి స్పృహ కోల్పోయాడు. రెండో వ్యక్తిని వదిలేసిన రెస్టారెంట్ సిబ్బంది డయల్ 100కు ఫోన్ చేసి చెప్పారు. తాలుకా పోలీసులు వెళ్లే సరికి అప్పటికే దెబ్బలు తిన్న వ్యక్తి మృతి చెంది ఉన్నాడు. సమాచారం తెలుసుకున్న డీఎస్పీ వి.నారాయణస్వామిరెడ్డి పోలీసు సిబ్బందితో వెళ్లి ఘటన జరిగిన ప్రాంతాన్ని పరిశీలించారు. మృతదేహంపై గాయాలు కనిపిస్తుండడంతో వెంటనే రెస్టారెంట్ సిబ్బందిని అదుపులోనికి తీసుకొని విచారిస్తున్నారు. రెస్టారెంట్ సిబ్బంది వదిలిపెట్టిన బాపట్లకు చెందిన షేక్ సుభాన్‌గా గుర్తించి వెంటనే అతడిని పట్టుకొని ఘటనకు సంబంధించిన వివరాలను అడిగి తెలుసుకున్నారు. మృతుడు బాపట్ల జిల్లా అద్దంకి ప్రాంతానికి చెందిన వెంకటరావుగా గుర్తించారు. సుభాన్ ఫిర్యాదు మేరకు హత్య కేసుగా నమోదు చేసి విచారణ చేస్తున్నట్లు తెలిపారు.

చోరీ కేసుపై దర్యాప్తు ముమ్మరం


బాధితులతో మాట్లాడుతున్న క్రైం ఏఎస్పీ శ్రీధర్ బాబు

సింగరాయకొండ: స్థానిక బైరాగిమాన్యంలో షేక్ అబ్దుల్ హమీద్ ఇంట్లో బుధవారం రాత్రి 15 సవర్ల బంగారం, 4.30 లక్షల రూపాయల నగదు చోరీ అయిన విషయం తెలిసిందే. ఈ కేసు దర్యాప్తును పోలీసులు ముమ్మరం చేశారు. చోరీ జరిగిన ఇంటిని గురువారం క్రైం ఏఎస్పీ శ్రీధర్‌బాబు పరిశీలించి బాధితులతో మాట్లాడారు. ఎప్పుడూ జనాలతో సందడిగా ఉండే బైరాగిమాన్యం ప్రాంతంలో.. బాధిత కుటుంబం ఊరికి వెళ్లిన మూడున్నర గంటల్లోనే చోరీ జరగడం సంచలనం సృష్టించింది. చోరీ జరిగిన ఇంటికి సమీపంలోని భవన నిర్మాణ పని సాగుతుండటంతో వర్కర్లు తిరుగుతూనే ఉంటున్నారు. అయినప్పటికీ చోరీ జరగడంపై పోలీసులకు అనుమానాలు తలెత్తుతున్నాయి. ఇంటి వెనుక తలుపు వద్ద ఎర్ర గాజు ముక్క పడి ఉండటంతో మహిళల ప్రమేయం ఉందా అనే అనుమానం కూడా వ్యక్తమవుతోంది. ఇదిలా ఉండగా.. అబ్దుల్ హమీద్ ఇంటి మరమ్మతుల కోసం డబ్బు తీసుకొచ్చిన విషయం గత నాలుగు రోజులుగా ఆ ప్రాంతంలో ప్రచారంలో ఉందని స్థానికులు చెబుతున్నారు. చోరీ బయట వ్యక్తులు చేసే అవకాశం లేదని, ఈ ఇంటి గురించి బాగా తెలిసిన వారి పనే అయిఉంటుందన్న ప్రచారం జోరుగా సాగుతోంది. అంతేగాక రజియా గ్రామైక్య సంఘం అధ్యక్షురాలు కాగా, అరిషియా వలంటీర్. ఈ నేపథ్యంలో వీరి ఇంటికి ఎప్పుడూ ఎవరో ఒకరు వస్తుంటారని స్థానికులు తెలియజేస్తున్నారు. ఈ కేసుకు సంబంధించి విచారణను పోలీసులు వేగవంతం చేశారు. అనుమానితులను వేలిముద్రలు సేకరిస్తున్నారు. రెండు రోజుల్లోగా కేసును ఛేదిస్తామని సీఐ దాచేపల్లి రంగనాథ్ ధీమా వ్యక్తం చేశారు.

ఉరేసుకొని వివాహిత మృతి

మార్టూరు: భార్యభర్తల మధ్య ఏర్పడిన చిన్నపాటి వివాదంతో క్షణికావేశంతో భార్య బలవన్మరణానికి పాల్పడింది. ఈఘటన మార్టూరులో గురువారం జరిగింది. సీఐ ఎస్‌కేటీ ఫిరోజ్ వివరాల మేరకు.. స్థానిక క్వారీ కుంటల్లో నివాసముండే షేక్ హుస్సేన్‌తో జే పంగులూరు మండలం ముప్పవరం గ్రామానికి చెందిన మస్తాన్‌బీ (24)కి ఇచ్చి ఐదేళ్ల క్రితం వివాహం జరిపించారు. వీరికి నాలుగేళ్ల కుమార్తె, 2 సంవత్సరాల కుమారుడు ఉన్నారు. ఇటీవల మస్తాన్‌బీ కుమారుడికి మార్టూరులో నిర్వహించిన ఫంక్షన్ కోసం ఆమె తల్లిదండ్రులు ముప్పవరం నుంచి పాట్లేళ్లను అప్పుగా ఇప్పించారు. పాట్లేళ్ల బాకీ తీర్చే విషయమై గురువారం ఉదయం భార్యభర్తల మధ్య చిన్నవివాదం జరిగింది. అనంతరం మనస్తాపానికి గురైన మస్తాన్‌బీ ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యాన్‌కు ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. గమనించిన బంధువులు మస్తాన్‌బీని కిందకు దించి స్థానిక ప్రభుత్వాసుపత్రికి తరలించారు. పరిశీలించిన వైద్యులు అప్పటికే ఆమె మృతి చెందినట్లు తెలిపారు.

ప్రాణం తీసిన అతివేగం

- రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి, మరొకరికి తీవ్ర గాయాలు


తీవ్ర గాయాలైన వ్యక్తికి చికిత్స చేస్తున్న వైద్యులు


సంఘటనా స్థలంలో వెంకటేష్ మృతదేహం

దర్శి: రోడ్డు ప్రమాదంలో యువకుడు ప్రాణాలు కోల్పోయాడు. ఈ ఘటన మండలంలోని బొట్లపాలెం సమీపంలో గురువారం జరిగింది. వివరాల్లోకి వెళితే..దర్శి నుంచి ముగ్గురు వ్యక్తులు మోటార్ సైకిల్‌పై వెళుతుండగా బొట్లపాలెం దాటిన తరువాత మలుపులో అతివేగంతో వాహనాన్ని అదుపు చేయలేక చెట్టును ఢీకొన్నాడు. ప్రమాదంలో ద్విచక్రవాహనం నడుపుతున్న వెంకటేష్(19) అక్కడికక్కడే మృతి చెందాడు. వాహనంపై ఉన్న మరొకరికి తీవ్ర గాయాలు కాగా మరొకరికి స్వల్ప గాయాలయ్యాయి. క్షతగాత్రులను 108లో ప్రభుత్వాసుపత్రికి తరలించారు. చింతలకు చెందిన పవన్ అనే వ్యక్తి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తరలించారు.

అత్యాచారయత్నం కేసులో నిందితుడికి ఐదేళ్ల జైలు

ఒంగోలు టౌన్: అత్యాచారయత్నం కేసులో నిందితుడికి జైలు శిక్ష వేస్తూ న్యాయస్థానం తీర్పు ఇచ్చింది. పూర్తి వివరాలు ఇలా వున్నాయి. 2018లో నాగులప్పలపాడు గ్రామానికి చెందిన 40 ఏళ్ల మహిళ నిద్రిస్తున్న అదే గ్రామానికి చెందిన పులుగు విఠల్‌రెడ్డి ఇంట్లోకి ప్రవేశించి అత్యాచారయత్నానికి పాల్పడ్డాడు. ఈ ఘటనలో అప్పటి ఎన్‌జీపాడు ఏఎస్సై జె.చంద్రశేఖర్ కేసు నమోదు చేసి విచారణ అనంతరం నిందితుడిని అరెస్టు చేశారు. ఎస్సై వి.అజయ్ కుమార్ కోర్టులో చార్జిషీటు దాఖలు చేశారు. నిందితుడిని రెండో ఏడీజే కోర్టు న్యాయమూర్తి సోమశేఖర్ ముందు హాజరుపరిచారు. మహిళను కత్తితో బెదిరించి అత్యాచారం చేసినట్లు నేరం రుజువు కావడంతో నిందితుడికి ఐదేళ్ల జైలు శిక్ష, రూ.3 వేల జరిమానా విధిస్తూ గురువారం న్యాయమూర్తి తీర్పు వెలువరించారు.

ఈ తీర్పు గుణపాఠం కావాలి : ఎస్పీ మలికా గర్గ్

మహిళలపై అత్యాచారాలకు పాల్పడే వారికి ఈ తీర్పు గుణపాఠం కావాలని ఎస్పీ మలికాగర్గ్ చెప్పారు. మహిళలు, చిన్నారులపై అత్యాచారాలకు పాల్పడే వారు ఎట్టి పరిస్థితుల్లోనూ చట్టం నుంచి తప్పించుకునే వీల్లేకుండా కృషి చేస్తున్నామన్నారు. గుడ్ ట్రయల్ మానిటరింగ్ ద్వారా నిందితుడికి జైలు శిక్ష పడేలా చేసిన అప్పటి ఎస్సై అజయ్‌కుమార్, ఏఎస్సై చంద్రశేఖర్, అడిషనల్ పీపీ యత్తపు కొండారెడ్డి, కోర్టు లైజన్ ఏఎస్సై లక్ష్మీనారాయణ, సమన్స్ అమలు చేసిన ఏఎస్సై కొండయ్యను ఎస్పీ అభినందించారు.

అక్రమ మద్యం విక్రయ కేసులో రెండేళ్ల జైలు

ఒంగోలు టౌన్: ఇతర రాష్ట్రాలకు చెందిన మద్యాన్ని అక్రమంగా తీసుకొచ్చి విక్రయిస్తున్న వ్యక్తికి జైలు శిక్ష విధిస్తూ జేఎఫ్‌సీఎం కోర్టు గురువారం తీర్పు ఇచ్చింది. నాగులప్పలపాడు మండలం ఉప్పుగుండూరు గ్రామానికి చెందిన పాలపర్తి శ్రీను ఇతర రాష్ట్రాలకు చెందిన మద్యం విక్రయిస్తున్నట్లు నేరం రుజువు కావడంతో రెండేళ్ల జైలు శిక్ష, రూ.2 లక్షల జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పు వెలువరించినట్లు సెబ్ సీఐ లత ఒక ప్రకటనలో తెలిపారు.

'సురక్ష' అర్జీలు 98 శాతం పరిష్కారం

- జిల్లాలో మార్కాపురం టౌన్ అగ్రస్థానం
- ఎమ్మెల్యే కేపీ వెల్లడి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే నాగార్జునరెడ్డి

మార్కాపురం: జగనన్న సురక్ష కార్యక్రమంలో భాగంగా గడిచిన నెల రోజుల వ్యవధిలో మార్కాపురం నియోజకవర్గంలో 55,586 అర్జీలు రాగా 98 శాతం పరిష్కరించినట్లు ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి వెల్లడించారు. గురువారం మార్కాపురంలోని తన నివాసంలో పార్టీ నాయకులతో కలిసి ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడారు. రాష్ట్ర వ్యాప్తంగా జగనన్న సురక్ష కార్యక్రమం జూలై 1 నుంచి 31వ తేదీ వరకు నిర్వహించగా.. సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు గృహసారథులు, జేసీఎస్ కన్వీనర్లు మొత్తం 1.50 కోట్ల గృహాలను సందర్శించి ప్రజలకు అవసరమైన 11 రకాల సర్టిఫికెట్లను ఉచితంగా అందించారని తెలిపారు. దేశంలో ఇలాంటి కార్యక్రమం ఎప్పుడూ.. ఎక్కడా నిర్వహించలేదని, ఈ ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. సర్టిఫికెట్ల మంజూరులో జిల్లాలో మార్కాపురం మున్సిపాలిటీ అగ్రస్థానంలో ఉందని ఎమ్మెల్యే పేర్కొన్నారు. రాష్ట్రంలో సంక్షేమం, అభివృద్ధి సమాంతరంగా జరుగుతున్నాయన్నారు. రాష్ట్రంలో పరిపాలన, అమలవుతున్న పథకాలు దేశానికే ఆదర్శంగా నిలుస్తున్నాయని చెప్పారు. సమావేశంలో పార్టీ రాష్ట్ర కార్యదర్శి షంషేర్ అలీబేగ్, మున్సిపల్ చైర్మన్ బాల మురళీకృష్ణ, వైస్ చైర్మన్లు షేక్ ఇస్మాయిల్, అంజమ్మ శ్రీనివాసులు, ఏఎంసీ చైర్మన్ గొలమారి శ్రీనివాసరెడ్డి, కౌన్సిలర్లు సిరాజ్, కొత్త కృష్ణ, బుశెట్టి నాగేశ్వరరావు, పార్టీ నాయకులు పత్తి రవిచంద్ర, ఉత్తమ్‌కుమార్, వేల్పుల చెన్నారెడ్డి, మాజీ వైస్ చైర్మన్ షేక్షావలి, శివాలయం దేవస్థానం చైర్మన్ కేశవరావు తదితరులు పాల్గొన్నారు.

ఏపీఎల్‌కు ఏడుగురు క్రీడాకారుల ఎంపిక


ఎం.లేఖజ్


ఎస్.ఆశిష్

ఒంగోలు: ఆంధ్రా ప్రీమియర్ లీగ్(ఏపీఎల్) సెషన్ 2లో భాగంగా ప్రకాశం క్రికెటర్లకు కాసుల వర్షం కురిసింది. ప్రకాశం జిల్లానుంచి ఏడుగురు క్రీడాకారులకు ఈ లీగ్‌లో చోటు లభించింది. ఎం.లేఖజ్(కోస్టల్ రైడర్స్)-రూ.4.50 లక్షలు, ఎస్.ఆశిష్(కోస్టల్ రైడర్స్)-రూ.1.90లక్షలు, వి.వేణు(వైజాగ్ వారియర్స్)-రూ.1.60 లక్షలు, జి.రోహిత్(ఉత్తరాంధ్ర లయన్స్) రూ.లక్ష ఎం.అభినవ్(బెజవాడ టైగర్స్) రూ.60వేలు, పీవీ పవన్(కోస్టల్ రైడర్స్) రూ.50వేలు, ఎ.కిరన్(కోస్టల్ రైడర్స్) రూ.25వేల చొప్పున ఎంపికయ్యారు. ఈ నెల 16 నుంచి జరిగే ఏపీఎల్ రెండో సెషనల్ వీరు సంబంధిత జట్ల తరుపున ప్రాతినిధ్యం వహిస్తారు. ఎంపికైన క్రీడాకారులను ప్రకాశం జిల్లా అడ్‌హక్ కమిటీ కన్వీనర్ ఎం.వీరరాఘవరెడ్డి అభినందించారు.